క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

వనపర్తి రూరల్: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో మండలంలోని పెద్దగూడెం గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దగ్గర హైమాస్ట్ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు, రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి పాల్గొని లైట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవికిరణ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శారద, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ కనబర్చాలి

వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలని ఎంఈఓ నర్సింహులు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలతోపాటు పలు ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఇంగ్లిష్, గణితం తదితర సబ్జెక్టుల్లో విద్యార్థులను రాణించేలా ఉపాధ్యాయులు కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

వీపనగండ్ల: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలపడాలని జిల్లా మహిళా సమైక్య కోశాధికారి ఎత్తం చిట్టెమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో మహిళాశక్తి విజయోత్సవ సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కోటీశ్వర్లను చెయ్యాలన్న సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీపనగండ్ల గ్రామ సంఘం అధ్యక్షురాలిగా భారతి, కార్యదర్శిగా స్వప్న, కోశాధికారిగా దేవమ్మను ఎన్నుకున్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

వీపనగండ్ల: మామిడిసాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబిస్తేనే అధిక దిగుబడులు పొందవచ్చునని అపేడ హైదరాబాద్ సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృషి విజ్ఞానకేంద్రం సైంటిస్ట్ రాజేందర్‌రెడ్డి, హార్టికల్చర్ సైంటిస్ట్ సురేశ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో తాజాపండ్లు, ఎగుమతి అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల హార్టికల్చర్ ఆఫీసర్ కృష్ణ, ఏఈఓ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

వనపర్తి రూరల్: జానంపేట గ్రామానికి చెందిన వ్యక్తి ఈనెల 9 నుంచి కనిపించడం లేదని భార్య లక్ష్మి గురువారం పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరంగాపురం మండలంలోని జానంపేట గ్రామానికి చెందిన వీరపాగ విజయ్ గత కొన్నేళ్ల నుంచి పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈనెల 9న సాయంత్రం బీచుపల్లికి ఆలయానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మళ్లీ ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయింది. తెలిసిన బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య లక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసుగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళ మిస్సింగ్

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణానికి చెందిన మహిళ ఈ నెల 9నుంచి కనిపించడం లేదని ఆమె భర్త గుర్రం భార్గవ్ గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన గుర్రం భార్గవి టీటీసీ చదువుతుంది. ట్రైనింగ్ క్లాసులు చెప్పడానికి 9న ఉదయం ఇంటినుంచి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి వెళ్లింది. కాని ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె భర్త చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ఆచూకి లభించక పోవడంతో ఆమె భర్త గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైక్, జీపు ఢీ.. ఇద్దరికి గాయాలు

గోపాల్‌పేట: బైక్, జీపు ఢీ కొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రేవల్లికి చెందిన పెద్దఉస్సేన్, బంగారయ్య ద్విచక్ర వాహనంపై పాత బండరావిపాకులకు వెళ్లి తిరిగి నాగర్‌కర్నూల్ వెళ్తున్నారు. అదే సమయంలో నాగర్‌కర్నూల్ నుంచి ప్యాసింజర్ జీపు నాగపూర్ వెళ్తుండగా జీపు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పెద్ద ఉస్సేన్, బంగారయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కలవారు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి గాయపడిన వారిని నాగర్‌కర్నూల్‌కి తరలించారు.

రెండో శనివారం సెలవు ఇవ్వాలి

విద్యావిభాగం: రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రతినెలా రెండో శనివారం సెలవు ఇవ్వాలని గురువారం ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు డీఈవో అబ్దుల్‌ఘనిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ప్రైవేట్ స్కూల్స్‌లో పనిచేసే టీచర్స్ ప్రతిరోజూ 8 నుంచి 9 గంటలు పనిచేయడంతో పాటు పరీక్షాపేపర్స్, ఇతర పనుల కోసం ఇంటివద్ద కొంత పనిచేస్తూనే ఉంటున్నామన్నారు. పనిభారంతో శనివారం సెలవులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిలో సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్, ఆంజనేయులు, పరమేష్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో అంజన్న ఆలయం



దొంగలు పగులగొట్టిన హుండీ (ఫైల్)



శిథిలావస్థలో పల్లె ఆంజనేయస్వామి దేవాలయం

- తప్పని దొంగల బెడద
- కనీస వసతుల్లేక భక్తుల ఇక్కట్లు
- మంత్రి చొరవ చూపాలంటున్న భక్తులు

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలోని కామధేనుపల్లి శివారులో వెలిసిన అభయాంజనేయ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకొని కనీస వసతులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయంలో ఉంచిన వస్తువులను, హుండీ డబ్బులను గుర్తుతెలియని వ్యక్తులు పలుమార్లు ఎత్తుకెళ్తున్నారు. సమీప గ్రామాల ప్రజలు ఈ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దేవాదాయశాఖ అధికారులు ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకురావాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన ఆలయం:
మండలంలోని గోపల్‌దిన్నె, రంగవరం, గోవర్ధనగిరి, వెలగొండ, వీపనగండ్ల గ్రామాల ప్రజలు ఈ ఆలయాన్ని తరచూ సందర్శిస్తూ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఎన్నో రోజులుగా ఆలయం శిథిలావస్థకు చేరడంతో పలువురు దాతల సహకారంతో మరమ్మతులకు పూనుకున్న అవి సఫలీకృతం కాలేదు.

అమావాస్యకు అధికసంఖ్యలో భక్తులు :
ప్రతి అమావాస్యకు రాత్రివేళల్లో అధికసంఖ్యలో ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకొని భజనలు, జాగారాలు చేసి నైవేద్యాలు సమర్పించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుగ్రామాల సమీపంలోని మండల కేంద్రానికి వెళ్లే మార్గాన ఈ ఆలయం ఉండడంతో విద్యార్థులు, రైతులు ప్రతి నిత్యం ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయాన్ని పునర్‌నిర్మించాలని కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



పురాతన ఆలయం కావడం వల్ల శిథిలావస్థకు చేరుకుంది. ఎండోమెంట్ అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయాన్ని పునర్‌నిర్మిస్తే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

–శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ గోపల్‌దిన్నె

కనీస వసతులు లేవు



ఆలయాన్ని సందర్శించేందుకు వచ్చే మహిళా భక్తులకు కనీస వసతులు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. కొలిచినవారికి కొంగుబంగారంగా చెప్పుకునే ఈ ఆంజనేయ స్వామి ఆలయ దుస్థితి చేస్తే బాధేస్తుంది. అధికారులు ప్రత్యేక చొరవ చూపి ఆలయాన్ని అభివృద్ధి పథంలో తేవాలి.

– సుదర్శన్ మాజీ ఉపసర్పంచ్ రంగవరం

భక్తులు చొరవ చూపాలి



ఆంజనేయస్వామి ఆలయంలో దాదాపు 10 గ్రామాల ప్రజలు తరచూ సందర్శిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. భక్తులంతా కలిసి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. దొంగల బారిన పడకుండా స్థానిక పోలీసులు ప్రత్యేకనిఘాను ఏర్పాటు చేయ్యాలి. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయా గ్రామాల ఆలయాలకు నిధులు కేటాయించారు. దీంతో ఈ ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తే తప్ప ఆలయం అభివృద్ధిలోకి రాదు.

–తెలుగు భగవంత్ భక్తుడు వీపనగండ్ల

మహాసభలను జయప్రదం చేయాలి

పాన్‌గల్: ఈనెల 14, 15వ తేదీల్లో పెబ్బేర్ పట్టణంలోని సహారా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సీఐటీయూ జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశరాము గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులు గా సీఐటీయూ ష్ర, అధ్యక్ష, కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షురాలు, జిల్లా ఇంచార్జి జయలక్ష్మి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలన్నారు.

దాతల సాయం మరువలేనిది



పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల తోడ్పాటు, తల్లిదండ్రుల సహకారం మరువలేనిదని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వవిద్యార్థి సుధీర్‌గౌడ్ రూ.31వేల విలువచేసే టైలు, బెల్టులు, బూట్లు, సాక్సులు దాదాపుగా 80 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తుండటంతోనే పాఠశాలల్లో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కురుమూర్తినాయక్, మాజీసర్పంచ్ వెంకటయ్యయాదవ్, మాజీ ఉప సర్పంచ్ సురేందర్‌గౌడ్, రవికుమార్‌రెడ్డి, యుగంధర్‌గౌడ్, ఉపాధ్యాయబృందం రాధాకృష్ణ, లక్ష్మణ్‌యాదవ్, పరమేశ్వరీ, భాగ్యశ్రీ, శరణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రద్దు చేసిన ఇళ్ల వివరాలు ఇవ్వాలి



అమరచింత: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 29మందికి ఇతర కారణాలు చూపుతూ రద్దు చెయ్యడం తగదని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో రద్దు చేసిన వారి కుటుంబాలను మంజూరు చేయాలని మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి మాట్లాడుతూ.. పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ పంపిణీ సమయానికి ఒక రోజు ముందే అర్హుల జాబితాను ప్రకటించిన అధికారులు మంజూరు పత్రాల పంపిణీలో పేర్లను చేర్చకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే అర్హులకు ఇళ్లను ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.

శుభ్రతతో ఆరోగ్య జీవితం

అమరచింత: ప్లాస్టిక్‌ను నిత్యం వాడకంతో ప్రజలు ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతారని వాటిని నిషేధించాలని మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ అన్నారు. వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మెప్మాసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల దాడులు సహించం

చిన్నంబావి: మండలంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై రోజురోజుకు కాంగ్రెస్ నాయకులు దాడులు పెరిగిపోయాయని, చట్టాలను రక్షించాల్సిన పోలీసులు చోద్యం చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన మండలంలోని చిన్నమారు గ్రామంలో ఇరువర్గాల గొడవల్లో గాయపడ్డ మాజీ ఉపసర్పంచ్ బాలవీర్, కుర్మయ్యలను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని లక్ష్మిపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డిని దారుణంగా హత్య చేసి ఏడాది దాటిన ఇప్పటివరకు కేసులో పురోగతి లేదన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అలజడులతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే తిరిగి వారిపైన కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కొల్లాపూర్‌లో మంత్రి అండతో విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని, వాటిని బీఆర్‌ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితిలో సహించమన్నారు. దాడులకు కాంగ్రెస్ పార్టీ దిగితే బీఆర్‌ఎస్ సైతం ప్రతిదాడులు చేసేందుకు వెనుకడుగు వేసేది లేదని హెచ్చరించారు. చిన్నమారు సంఘటనకు పోలీసులు బాధితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మండల సీనియర్ నాయకులు గోవిందు, శ్రీధర్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పెబ్బేరు పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన పట్టణంలో 5, 6 వార్డులో ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలు అమలుపర్చడంలో విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కర్రెస్వామి, సాయినాథ్, చిన్నఎల్లారెడ్డి, విశ్వరూపం, రామకృష్ణ, శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో శ్రీ దత్త కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ఆది దంపతులైన శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేయగా భక్తులు తలంబ్రాలు పోసి అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అన్నదానం ఏర్పాటు చేశారు.

పుస్తకాలు అందజేత

కొత్తకోట రూరల్: పట్టణకేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖాధికారి మల్లిఖార్జున్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గతేడాది కమిషనర్ క్షితిజ సందర్శించారు. లైబ్రరీ పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్ పంపించిన లైబ్రరీ పుస్తకాలను గురువారం అందజేశామన్నారు. అదేవిధంగా వాటర్‌బాటిల్స్, పాదరక్షలు, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్‌ను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాసహాయ అధికారి మల్లేశం, వార్డెన్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీరాంరెడ్డి

అమరచింత: మండల ఎంపీడీఓగా ఆత్మకూర్ ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాంరెడ్డి గురువారం బాధ్యతలను తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ చెన్నమ్మ నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆత్మకూర్ ఎంపీఓను అమరచింత ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

వనపర్తి రూరల్: సాయిసేవాసమితి ఆధ్వర్యంలో గురువారం పెబ్బేరు పట్టణంలోని షిరిడి సాయి బాబ ఆలయంలో గురుపౌర్ణమి వైభవంగా నిర్వహించారు. మహిళలు సామూహిక సాయిసత్య వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అనంతరం సాయిపల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధరూర్ శ్రీను, హనుమంతురెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరచింత: గురుపౌర్ణమిని సందర్భంగా పట్టణంలోని షిరిడిసాయి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, ప్రత్యేకాభిషేకాలు చేశారు. హోమంతో పాటు సత్య సాయివ్రతం నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ, మహా మంగళహారతి చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రఘు, తాటికొండ, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: గురు పూజోత్సవంలో భాగంగా గురువారం చెలిమి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు వరదాచారిని విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గణేష్‌కుమార్, రవి, గిరిరాజాచారి, ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని షిరిడిసాయి ఆలయంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆమె వెంట జగదభిరాంరెడ్డి, రాంలక్ష్మారెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పూజలు చేస్తున్న సీతాదయాకర్‌రెడ్డి



గురువుని సన్మానిస్తున్న విద్యార్థులు

రూ.వేలకోట్లు తెస్తినంటివి.. ఎక్కడ?

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ భవనం పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎందుకు నిధులు తీసుకురావడం లేదని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ప్రశ్నించారు. గురువారం వారు పాలిటెక్నిక్ భవనాన్ని పరిశీలించి సతీష్‌యాదవ్ మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా రాజా గారి బంగ్లా కోసం పోరాడి అప్పటి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ రూ.22 కోట్లు మంజూరు చేయించి టెండర్ పూర్తై పనులు ప్రారంభమయ్యే క్రమంలో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ఎమ్మెల్యేగా గెలిచిన మేఘారెడ్డి జీవోను మార్చి రూ.22 కోట్లు తెచ్చి పనులు ప్రారంభిస్తానని చెప్పి నేటికీ ఎందుకు నిధులు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. బీసీ హాస్టల్ బిల్డింగ్ కట్టలేరా? కనుక వెంటనే పాలిటెక్నికల్ కళాశాలకు పూర్వవైభవం తేవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే బంగ్లాను కాపాడాలని లేనిచో ప్రజాఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గొనికాడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ భవనాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

ఐటీఐ కళాశాల సందర్శన

వనపర్తి రూరల్: ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని రాజపేట శివారు లోని ఐటీఐ కళాశాలను గురువారం జిల్లా నాయకుడు శ్రీకాంత్ సందర్శించారు. ల్యాబ్‌కి సంబంధించిన పరికరాలు, క్రీడామైదానం, మరుగుదొడ్ల వంటి సమస్యలను ప్రిన్స్‌పాల్ దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చొరవతో ఐటీఐ రంగంలో ఉన్నతస్థాయిలో రాణించే విధంగా విద్యార్థులకు పరికరాలు సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కుమార సంగర్కర, అనిల్, నబీల్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ప్రమీల, సురేష్ దంపతుల కుమారుడు సందీప్ పంజాబ్ నేషనల్ బ్యాంకులో అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గురువారం విషయం తెలుసుకున్న జెఎస్ రాములు ఫౌండేషన్ నిర్వాహకులు సందీప్ ఇంటికి వెళ్లి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.అమృతరాజు ఉన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

మదనాపురం: శ్రీకురుమూర్తిరాయ ఎత్తిపోతల ద్వారా సత్వరమే రైతులకు నీరు విడుదల చేయాలనీ మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఇలాంటివి మానుకోవాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రజలు సేవ చేసేందుకు అధికారం ఇచ్చారని, ప్రతిఒక్కరికీ మేలు చేయాలన్నారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టించడం మంచి పద్ధతి కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, టౌన్ అధ్యక్షు డు ఆవుల బాలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపులో వివక్ష ఎందుకు?

కొత్తకోట రూరల్: పట్టణంలో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించడంలో మున్సిపల్ సిబ్బంది వివక్షత చూపుతున్నారని, అధికార పార్టీకి ఒక న్యాయం, ఇతర పార్టీలకు ఒక న్యాయమా? అంటూ బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడంపై గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలో ఫ్లెక్సీలు తొలగించేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు ఒకటే న్యాయం.. ఒక్కటే పద్ధతి పాటించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బాబురెడ్డి, బీసం చెన్నకేశవరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కె.శ్రీనివాస్‌జీ ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

గోపాల్‌పేట: మండలంలో చుట్టుపక్కలనుంచి వచ్చే విద్యార్థుల కోసం బస్సుసౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు నడిచి వస్తూ చదువుకుంటున్నారు. బస్సుసౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలుర బీసీ హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ సైదయ్య గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూంలో నిత్యవసర సరకులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

గోపాల్‌పేట: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలంలో వివిధ కారణాల చేత సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా పదిమందికి రూ.2,15,000 మంజూరు కాగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెరపడేనా..?

- సెలవుల్లో ఎస్ఐ, ఏఎస్ఐ
- అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయినట్లు ప్రచారం
- ఎస్ఐ నంబర్ హెడ్ కానిస్టేబుల్‌కు అప్పగింత
- త్వరలో రానున్న కొత్త ఎస్ఐ

అమరచింత: అమరచింత పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ, ఏఎస్ఐలు సస్పెండ్ అయ్యారని ఇక స్టేషన్‌కు కొత్త ఎస్ఐ వస్తున్నారన్న ప్రచారం మండలంలో చక్కర్లు కొడుతున్నది. అవినీతి ఆరోపణల ఫిర్యాదులపై అధికారులకు అందియన్న సమాచారంతో ఎస్ఐ, ఏఎస్ఐలు ఇరువురు వ్యక్తిగత సెలవులు పెట్టి వెళ్లిన విషయం పాఠకులకు తెలిసిందే. ఇప్పటికే పది రోజుల పైబడి సెలవుల్లో ఉండటం ఏమిటని పలువురు పలు అనుమానాలు వ్యక్తం అవుతుండగానే తాజాగా ఇరువురు సస్పెండ్ అయ్యారనే విషయం సర్వత్రా చర్చనీయంగా మారింది. వీటికి తోడు గత మూడు రోజుల నుంచి ఎస్ఐకి ఇచ్చిన డిపార్ట్‌మెంట్ నంబర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌కు అప్పగించడంతో మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. కాగా పోలీసులు చెబుతున్న మాటలకు ఎంత మాత్రం పొంతన లేకుండా పోతున్నాయి. ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్ గత రెండునెలల కిందట మండలంలోని ధర్మాపురం గ్రామంలో జరిగిన క్రికెట్ గొడవల్లో వ్యక్తి మృతి చెందిన వ్యవహారంలో ఎస్ఐ,ఎఎస్ఐలు ప్రవర్తించిన తీరుపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని కేసు నమోదు చేసుకోండని బాధితులు స్టేషన్‌కు వస్తే విధుల్లో ఉన్న ఏఎస్ఐ ఫిర్యాదు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై అంతర్గతంగా రహస్య విచారణ జరిపిన అధికారులు ఇరువురిపై చర్యలకు సిద్ధమయ్యారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుసుకుని ఎస్ఐ, ఏఎస్ఐ సెలవులపై వెళ్లారు. ఇందంతా కేవలం సరిపెట్టుకునేందుకే అని ఎస్ఐ, ఏఎస్ఐలు సస్పెండ్ అయిన పోలీసు అధికారులు మాత్రం విషయాన్ని బయటికి పొక్కనీయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అవినీతి ఆరోపణలే అధికం..
ఎస్ఐ మండలంలోని పలు సంఘటనలో వ్యక్తిగతంగా ఫిర్యాదు దారులను బెదిరిస్తూ అందిన కాడికి దండుకోవడమే పనిగా పెట్టుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న తగాదాలలో కూడా డబ్బులు ఇవ్వనిదే తమకు న్యాయం జరిగదనే వాదనలు వినిపిస్తున్నాయి. కాగా ఇసుక, అప్పట్లో పీడీఎస్ బియ్యం అక్రమ సరఫరా, మొరం మట్టి తరలింపు, పొలం పంచాయతీల్లో అందినకాడికి దండుకోవడమే వీరి ప్రవృత్తిగా మారిందనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందుతున్నాయనే గుబులుతో అధికార పార్టీ నాయకులతో కలిసి తమపై వచ్చిన అభియోగాలను దూరం చేసుకోనే యత్నాలు కొనసాగుతున్నాయని తెలిసింది.



అమరచింత పోలీస్‌స్టేషన్

డిపార్ట్‌మెంట్ నంబర్ తీసుకున్నాం : సీఐ
అవినీతి ఆరోపణల వ్యవహారంలో సెలవుల్లో వెళ్లిన ఎస్ఐ సురేష్‌కు ఇచ్చిన డిపార్ట్‌మెంట్ నంబర్‌ను మూడు రోజుల కిందట తీసుకున్నామని సీఐ శివకుమార్ తెలిపారు. వారిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతుంది. సామాన్య ప్రజలకు సేవ చెయ్యాలని, వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని పలుమార్లు చెప్పడం జరిగిందన్నారు. సస్పెండ్ అయ్యారన్న ప్రశ్నకు స్టేషన్‌కు కొత్త ఎస్ఐ వస్తారని బదులిచ్చారు.